క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్ లైనులో మరమ్మతులు, స్తంభాలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు వంటి పనుల వల్ల సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కాపువాడ, భట్‌పల్లి రోడ్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముగిసిన పూజా కార్యక్రమాలు

తిర్యాణి: మండలంలోని నాయకపుగూడ గ్రామంలో గత పది రోజుల నుంచి నిర్వహించిన పెద్దయ్య –చిన్నయ్య దేవుని పూజలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపుపోడ్ కులస్తులు దేవుళ్లకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

‘అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం’


దెబ్బతిన్న ఇల్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తలమడుగు: అకాల వర్షానికి, ఈదురు గాలులకు ఇల్లు రేకులు కొట్టుకుపోయి నష్టపోయిన బాధితులు ఎవరూ అధైర్య పడొద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పూపగూడ, ఝరి, పల్సి గ్రామాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. అలాగే దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఎవరూ అధైర్య పడొద్దని వారికి ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు. బాధితులకు అనిల్ అన్న యువ సైన్యం సొసైటీ ఆధ్వర్యంలో 30 మందికి తాత్కాలిక నివాసం కోసం తాడిపత్రిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కుమార్, అభిరామ్ రెడ్డి, అబ్దుల్లా, చంటి, తదితరులు పాల్గొన్నారు.

బీడీ వేతన ఒప్పంద చర్చలు సఫలం

ఎదులాపురం: బీడీ కార్మిక యూనియన్, బీడీ యాజమాన్య సంఘానికి మధ్య శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన వేతన ఒప్పంద చర్చలు సఫలమైనట్లు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నా యకులు జగన్‌సింగ్ తెలిపారు. ఆదివాకం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులు, యూనియన్ల పోరాటాల ఫలితంగానే చ ర్చలు సఫలమైనట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న ఏడు లక్షల మంది కార్మికులకు మేలు జరగనుందన్నారు. పెరిగిన వేతనాలను అమలు చేయాలన్నారు.

యువత ఐక్యంగా ఉండి ఉపాధి పొందాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత ఐక్యంగా ఉండి ఉపాధి పొందాలని జిల్లా ఎంపీ సోయం బాపురావ్ తనయుడు సోయం వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని సాకేర(బి) గ్రామ యూత్ కమిటీ సభ్యులకు సుమారు రూ. 1 లక్ష రూపాయల విలువగల సౌండ్ సిస్టం అందజేశారు. యువజన కమిటీలకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సోయం రాందాస్, మాజీ సర్పంచ్ లింగు, చిక్రం రాము పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

బేల: మండల కేంద్రంలోని తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కార్మికశాఖ, సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో లేబర్‌కార్డు ఉన్న కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికీ 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని సీఎస్‌సీ జిల్లా కో ర్డినేటర్ సయ్యద్ పర్వేజ్ తెలిపారు. లేబర్‌కార్డు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ కేర్ క్యాంప్ కోఆర్డినేటర్ అబ్దుల్ ఖదర్ సుఫీ, సామాజిక కార్యకర్తలు వెంకన్న, హరీశ్, రితేష్ పాల్గొన్నారు.

సబ్సిడీపై సోయా విత్తనాలు అందించాలి

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం సోయావిత్తనాలను సబ్సిడీపై అందించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి తర్వాత అత్యధికంగా సోయా పంట పండిస్తారని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సోయా విత్తనాలపై సబ్సిడీ ఎత్తి వేయడంతో రైతులు నష్టపోయారని అన్నారు. 50 శాతం సబ్సిడీపై సోయా విత్తనాలు అందచేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఆరోగ్యానికి ‘శాకాహారం’!


కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

- కూరగాయలతో ఎంతో మేలు
- ప్రతీరోజు తీసుకోవాలంటున్న వైద్యులు
- మండుతున్న ధరలు


తాజా కూరగాయలు

కెరమెరి: ‘ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు’ రోజూ వ్యాయమం చేయడంతో పాటు పోషక విలువలతో కూడిన కూరగాయలు, ఆకుకూరలు తినాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యవంతమైన జీవనానికి కొన్ని నియమాలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం మేలు చేస్తుందంటున్నారు.

ధరలు మెండు..

కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అయితే కూరగాయల ధరలు మాత్రం మండుతున్నాయి. ఆదివారం కెరమెరి మార్కెట్లో టమాటా కిలోరూ. 40 పలకగా, అల్చింత రూ.40, క్యాబేజి రూ.100, బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.120, పత్తాగోబి రూ.80, సిమ్లామిర్చి కిలో రూ.120 పలకడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. వారంలోనే రెండింతలు ధరలు పెరగడంతో అమ్మో! అంటూ కొనలేని పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు.

తాజా పండ్లు, కూరగాయలు..

ప్రతీ వ్యక్తి పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. అప్పుడే రోగాలు దరిచేరకుండా ఉంటాయి. ఆరోగ్యానికి తాజా పండ్లు తినాలి. ప్రధానంగా దానిమ్మ, ద్రాక్ష, ఆపిల్, బత్తాయి, జామా, అరటిపండ్లతో పాటు మొలకెత్తిన గింజలు, సోయా బీన్‌లు ఎంతో మేలు చేస్తాయి. మెంతికూర, తోటకూర, గంగవాయి కూర వంటి ఆకుకూరలు విరివిగా తినాలి. మానవుడి ఆరోగ్యానికి కూరగాయలు ఎంతో మేలు చేస్తాయి. వంకాయలు, బెండకాయలు, బంగాళదుంపలు, బీట్‌రూట్, టమాట, కాకరకాయ, సోరకాయ, బీర, దొండ, తదితర కూరగాయలు ఎంతో మంచివి. ఇవి దీర్ఘకాలిక రుగ్మతలను దూరం చేస్తాయి. పీచుపదార్థాలు, ఫైబర్, ఎక్కువ ఉండే పదార్థాలు తీసుకుంటే జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది.

మార్కెట్లో విరివిగా..

ప్రస్తుతం కెరమెరి మార్కెట్లో తాజా కూరగాయలు ప్రతీరోజు లభిస్తున్నాయి. మండలంలోని ఝరి, మోడి, గోయగాం, కెలికే, కెలిబి, కెరమెరి, సావర్‌ఖెడా, ఇందాపూర్, జ్యోతినగర్ తదితర గ్రామాల్లో కూరగాయలను రైతులు పండిస్తున్నారు. ఆయా గ్రామాల్లో సంవత్సరం కాలమంతా ఏదో ఒక రకమైన కూరగాయలు లభిస్తుంటాయి.

కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి



కూరగాయల్లో అధిక ప్రోటీన్లు, విటమిన్లు ఉంటాయి. పప్పుతో పాటు ప్రతీరోజు భోజనంలో కూరగాయలు తీసుకోవాలి. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు అధికంగా తినాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కూరగాయలు తినడం ఎంతో మంచిది.

– ఎల్. సుధాకర్‌నాయక్, డిప్యూటీడీఎంహెచ్‌వో

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై రామన్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్‌లను గుర్తించి ఆదివారం బాధితులకు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ అప్పగించారు. విలేజ్‌నెం.10కి చెందిన గణేశ్, బసంత్‌నగర్‌కు చెందిన కిషన్‌దాస్, భట్‌పల్లికి చెందిన రాజేశ్వర్‌లు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకొని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీం పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలి


బెజ్జూర్: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రీధర్

బెజ్జూర్: లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఈవో శ్రీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని తలాయి, సుస్మీర్ గ్రామాల్లో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైన లూజ్ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదు తప్పని సరిగా పొందాలని సూచించారు. అందులో లాట్ నంబర్, వెరైటీ పేరు, ఎక్స్‌పైరీ వంటి విషయాలు ఉన్నాయా.. లేవా అన్నది ప్యాకెట్‌తో సరిపోల్చుకోవాలన్నారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువుల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి


కెరమెరి: మాట్లాడుతున్న ఏఈవో వెంకటేశ్

కెరమెరి: లైసెన్స్ ఉన్న విత్తన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఈవో వెంకటేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని టొకెనమోవాడ్‌లో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించిన రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. పంటల దిగుబడి వచ్చి పంటను విక్రయించే వరకు కూడా రశీదు భద్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. తీసుకున్న బిల్ మీద విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, రేటు ఉండాలని పేర్కొన్నారు.

అదుపు తప్పితే అంతే..


జాతీయ రహదారిపై ప్రమాదకరంగా బావి

రెబ్బెన: మండల కేంద్రం మీదుగా మంచిర్యాల టూ తెలంగాణ సరిహద్దు వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల భద్రతను గాలికొదిలేశారు. మండలంలోని దేవులగూడ సమీపంలో గల పల్లవి పైపుల ఫ్యాక్టరీ ముందు భాగంలో రోడ్డు పక్కనే ఉన్న బావిని పూర్తిగా పూడ్చకుండా వదిలేశారు. రోడ్డు విస్తరణ సమయంలో చిన్నపాటి పిట్టగోడలను కూల్చివేసిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రోడ్డు పక్కన అత్యంత ప్రమాదకరంగా ఉన్న బావిని మాత్రం ఎందుకు పూడ్చలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు లోతుగా ఉండే బావిపై కేవలం షేడ్‌నెట్ ఏర్పాటు చేసి వదిలేశారు. కనీసం రోడ్డుపై ఎలాంటి ప్రమాద హెచ్చరికలు కూడా ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారిపై వేగంతో వెళ్లే వాహనాలు ప్రమాదవశాత్తు అదుపు తప్పితే నేరుగా బావిలో పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఇతర ప్రాంతాల్లో వాహనాలు రోడ్డు పక్కన ఉన్న బావుల్లో పడి ప్రయాణికులంతా మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి బావిని పూడ్చి వేయాలని మండలవాసులు కోరుతున్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న ఆత్రం సుగుణ

బెజ్జూర్: మండలంలోని సుస్మీర్ గ్రామానికి చెందిన కుడిమేత ముత్తయ్య తల్లి కుడిమేత చంద్రబాయి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఆదివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడం గణపతి, ఐటీడీఏ డైరెక్టర్ కుమ్రం మాంతయ్య, కుశ్నపల్లి ఎంపీటీసీ ఆత్రం సాయి, నాయకులు కొడప శంకర్, ఎలాది చంద్రశేఖర్, ప్రశాంత్, అరుణ్, ఈశ్వర్, శంకర్, ప్రేంసాగర్, కార్యకర్తలు ఉన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి


వేద పండితుడి ఆశీర్వచనాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత మార్గంలో నడవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనరసింహ స్వామి యోగీశ్వర పీఠంలో నిర్వహిస్తున్న రాజ్యశ్యామల యాగంలో ఆదివారం పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. లోక కల్యాణార్థం శ్రీరాజశ్యామల మహా యాగాన్ని నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యాగం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. జిల్లాలోని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావనలను అలవర్చుకొని, ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాగం నిర్వాహకులు, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వకుళాభరణం ఆదినాథ్, పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్ పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు


జలంతో భక్తులు

జైనథ్: మండలంలోని ఖాప్రి గ్రామస్తులు గంగ నీళ్ల కోసం పోటెత్తారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున కాలినడకన ఉమ్రి మీదుగా బేల మండలం సాంగిడి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ పెన్‌గంగ నదిలో దిగి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నది నీళ్లను వెంట తెచ్చుకొని, గ్రామంలోని పోచమ్మ తల్లి, హనుమాన్ ఆలయం, శ్రీ కృష్ణాలయం, శివాలయాల్లో దేవత విగ్రహాలకు అభిషేకించారు. మహిళలు పిండి వంటలను గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించారు. ఈఏడాది వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు బాగా పండాలని, సమస్త మానవాళితో పాటు జంతుజీవాలు, పశుపక్షాదులు రోగాల బారిన పడకుండా సల్లంగా ఉండాలని మొక్కుకున్నారు.

పంటలు సమృద్ధిగా పండాలి

నేరడిగొండ: వర్షాకాలం ఆరంభానికి ముందు వడూర్ గ్రామస్తులు గ్రామదేవతలకు పూజల చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఆదివారం గ్రామస్తులందరూ కలిసి దేవత విగ్రహాలకి పూజలు చేశారు. డప్పు వాయిద్యాలతో శోభాయాత్ర చేపట్టారు. పాడి పంటలు సమృద్ధిగా పండి, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు.

ప్రజలు లేని చోట నిర్మాణాలు


కమ్యూనిటీ షెడ్డు


మంచినీటి ట్యాంకు


మురికినాలా

కెరమెరి మండలంలోని దేవుడ్‌పల్లి పునరావాస కేంద్రంలో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. ఎనిమిదేళ్ల క్రితం ప్రస్తుతం ఉన్న దేవుడ్‌పల్లి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాని ప్రజలను ఇప్పటివరకు అక్కడికి తరలించలేదు. గతంలోనే రోడ్డు, మురికి నాలాలు నిర్మించగా ఇటీవల రూ.5 లక్షలతో మంచినీటి ట్యాంకు, రూ.5 లక్షలతో కమ్యునిటీ షెడ్డు సైతం నిర్మించారు. ప్రజలు లేకుండా నిర్మాణాలు ఎవరి కోసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- కెరమెరి

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

దహెగాం: మండలంలోని లగ్గాం గ్రామానికి చెందిన మోరే బాపుకు చెందిన ఎద్దు ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. ఉదయం ఎద్దును మేతకు వదిలేయడంతో గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

సేంద్రియ ఎరువు తయారు చేయాలి


కొత్తగూడలో భగీరథ నీటిని పరిశీలిస్తున్న అంజద్‌పాషా


జోడేఘాట్‌లో సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

కెరమెరి: సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువులు తయారు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. ఆదివారం మండలంలోని జోడేఘాట్, పాట్నాపూర్, కొత్తగూడ, పాటగూడ, కొలాగూడ తదితర గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఉన్న శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతివనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీలను పరిశీలించారు. నర్సరీల్లో ఉన్న మొక్కలకు ప్రతీరోజు నీరు పోయాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల గురించి గ్రామస్తులకు వివరించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరావు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

నారాయణబాబాను స్ఫూర్తిగా తీసుకోవాలి

తాంసి: నారాయణబాబాను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒకరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని, సమాజసేవ చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని వామన్ నగర్‌లో నారాయణబాబా ఆశ్రమాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామానికి ఇళ్ల నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆశ్రమంలో షెడ్డు నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తానన్నారు. ఇందులో అధ్యక్షుడు పోచ్చన్న, నాగారెడ్డి, వినోద్ రెడ్డి, మహేందర్, కేదారేశ్వర్ రెడ్డి, మొట్టె కిరణ్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న భూమారెడ్డి

కెరమెరి: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూమారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల కోసం రూ.10లతో సభ్యత్వ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ కుమురం భీం జిల్లా కన్వీనర్‌గా కేంద్రె బాలాజీ (ధనోరా)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ వీరభద్రరావు, లాల్‌సింగ్, ఉత్తం, వినేష్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899